సాక్షి అనకాపల్లి

గురువారం । 18 । జూలై । 2024



ప్రమాదస్థాయికి 'డుడుమ'

ముంచంగిపుట్టు: డుడుమ జలాశయం నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరుకోవడంతో జోలా పుట్టు ప్రాజెక్ట్ నుంచి నీరు నిలిపివేశారు.



సముద్రంలో బోటు బోల్తా 8లో

హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లిన బోటు ప్రమాదానికి గురైంది. అందులోని మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.5/26.0

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

వెంకన్న సన్నిధిలో తొలి ఏకాదశి



స్వామివారి ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు





స్వామివారి దర్శనానికి క్యూలైన్లో భక్తులు (ఇన్‌సెట్) నూతన వస్త్రాలంకరణలో అమ్మవారు

- ఉపమాకకు పోటెత్తిన భక్తులు
- గాలిగోపురం వరకూ క్యూలైన్ల ఏర్పాటు

నక్కపల్లి: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్తరాంధ్రలో ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలి రావడంతో ఆలయం రద్దీగా మారింది. వీరి దర్శనానికి ఎటువంటి ఇబ్బంది పడకుండా తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గాలి గోపురం ఎదురుగా అఖిలాండం వరకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులంతా క్యూలైన్లో నడిచి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున మూడు గంటలకు గరుడాద్రిపై కల్కి అవతారంలో వెలసిన స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించిన పిదప భక్తులకు దర్శనం కల్పించామని ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు శేషాచార్యులు, కృష్ణమాచార్యులు తెలిపారు. అనంతరం కొండ దిగువన క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామి, స్వామివారి ఉత్సవమూర్తుల వద్ద, ఆండాళ్లమ్మ వారి సన్నిధిలో రోజువారి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారి ఉత్సవమూర్తులు వేణుగోపాలస్వామి, ఆండాళ్లమ్మవారిని నూతన వస్త్రాలతో వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా అనకాపల్లి, విశాఖపట్నం, యలమంచిలి నర్సీపట్నం, తుని, అడ్డురోడ్డు తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు రావడంతో క్యూలైన్లో వెళ్లి స్వామివారిని దర్శించుకునేందుకు గంటకు పైగా సమయం పట్టింది. టీటీడీకి చెందిన విజిలెన్స్ విభాగం వారు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సాయంత్రం ఉపమాకకు చెందిన శ్రీనివాస భక్త సమాజం ఆధ్వర్యంలో స్వామివారి గిరిప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు.

డీఐజీగా గోపీనాథ్ జట్టి బాధ్యతల స్వీకరణ



విశాఖపట్నం రేంజ్ డీఐజీగా బాధ్యతలు స్వీకరిస్తున్న గోపీనాథ్ జట్టి

సాక్షి, విశాఖపట్నం:

విశాఖ రేంజ్ డీఐజీగా గోపీనాథ్ జట్టి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2008 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన గోపీనాథ్ 2010 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు విశాఖ రూరల్ జిల్లాలో శిక్షణ పొందారు. 2010 అక్టోబర్ నుంచి 2011 మార్చి వరకు గ్రేహౌండ్స్‌లో అసాల్ట్ కమాండర్‌గా, 2011 ఏప్రిల్ నుంచి 2013 ఏప్రిల్ వరకు చింతపల్లి ఏఎస్పీగా, 2013 నుంచి 2014 వరకు గుంటూరు ఎస్పీగా, 2014 నుంచి 2016 వరకు తిరుపతి ఎస్పీగా, 2016 నుంచి 2017 వరకు 6వ బెటాలియన్ కమాండెంట్‌గా, 2017 నుంచి 2018 వరకు కర్నూల్ ఎస్పీగా, 2019 నుంచి 2022 వరకు టీటీడీ చీఫ్ విజిలెన్స్ అధికారిగా, 2022 ఏప్రిల్ నుంచి గ్రే హౌండ్స్ డీఐజీగా విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పరిధిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించడమే తన లక్ష్యమన్నారు. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా దృష్టి సారిస్తానని వెల్లడించారు. గంజాయిని నిర్మూలించేందుకు తగిన చర్యలు చేపడతానని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

కొత్త చట్టాలపై అవగాహన





గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ దీపిక (ఇన్‌సెట్) ఎస్పీగా బాధ్యతల స్వీకారం

- గ్రామీణ స్థాయి నుంచి ప్రజలకు వివరించేందుకు ప్రత్యేక ప్రణాళిక
- గంజాయి నివారణకు పటిష్ట చర్యలు
- పరిశ్రమల్లో పనిచేసే మహిళలకు ప్రత్యేక భద్రత
- బాధ్యతలు స్వీకరించిన కొత్త ఎస్పీ దీపిక

అనకాపల్లి: ఇటీవల దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చిన కొత్త చట్టాలపై జిల్లా ప్రజలకు అవగాహన కల్పిస్తామని జిల్లా నూతన ఎస్పీ ఎం.దీపిక చెప్పారు. ఆమె బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో గ్రామీణ స్థాయి నుంచి కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. అన్ని పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదీల సమస్యలు తీర్చేందుకు పటిష్ట చర్యలు చేపడతామన్నారు. పోలీస్ శాఖకు మంచి పేరు తెచ్చేలా విధులు నిర్వహిస్తామని, గంజాయి రవాణా అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపడతామన్నారు. మహిళలపై జరిగే నేరాల నిర్మూలన, మహిళా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ, శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలపై ప్రధానంగా దృష్టి సారిస్తామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజల సహకారంతో వారి ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. గంజాయి నిర్మూలనకు 100 రోజుల ప్రత్యేక ప్లాన్‌ను అమలు చేస్తున్నామని, జిల్లాలో ఎక్కడైనా గంజాయి రవాణా జరుగుతున్నట్టు సమాచారం ఉంటే దగ్గరలో పోలీస్ స్టేషన్‌కు తెలియపరచాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయని, అక్కడ విధులు నిర్వహించే మహిళలకు ప్రత్యేక భద్రత కల్పించడం జరుగుతుందని ఆమె చెప్పారు. పాఠశాలలు, కళాశాలల్లో దశల వారీగా మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. అంతకుముందు పోలీస్ గౌరవ వందనాన్ని ఆమె స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, డీఎస్పీలు ఎస్.అప్పలరాజు, కె.వి.సత్యనారాయణ, బి.అప్పారావు, పి.నాగేశ్వరరావు, సీఐలు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, జి.శంకరరావు, అప్పలనాయుడు, గణేష్, కుమారస్వామి, మన్మథరావు, సతీష్, నరసింహమూర్తి, సంజీవరావు, ఎస్ఐలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

చదువుకు ఇబ్బంది లేకుండా చర్యలు

- సాక్షి కథనానికి స్పందించిన విద్యా శాఖ

నాతవరం: ప్రభుత్వం కొత్తగా లెక్చరర్లను నియమించేంత వరకు హైస్కూల్ ఉపాధ్యాయులతో కాలేజీలో విద్యార్థులకు తరగతులు నిర్వహించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని నాతవరం ఎంఈవో కామిరెడ్డి వరహాలబాబు తెలిపారు. బుధవారం సాక్షిలో 'అటకెక్కిన చదువులు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. నాతవరం హైస్కూల్‌ను ప్రభుత్వం ఈ ఏడాది నుంచి కాలేజీగా అప్‌గ్రేడ్ చేసిన విషయం తెలిసిందే. కాలేజీ విద్యార్థులకు స్థానిక హైస్కూల్‌లో ప్రత్యేకంగా గదులు కేటాయించామని, వారి అవసరాలు తగ్గట్టుగా బెంచీలతోపాటు ఇతర సామగ్రిని ఏర్పాటు చేశామని ఎంఈవో తెలిపారు. టాయిలెట్స్, తాగునీటి కుళాయిలు ప్రత్యేకంగా ఉన్నాయని, తరగతులు మాత్రమే హైస్కూల్ ఉపాధ్యాయులతో నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం కాలేజీకి ప్రత్యేకంగా అధ్యాపకులు నియమించే వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని ఎంఈవో తెలిపారు.

వసతిగృహ విద్యార్థినులకు సమస్యలు రానీయొద్దు

- డీఈవో వెంకటలక్ష్మమ్మ



మోడల్ స్కూల్‌లో మోటార్‌ను పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

మునగపాక: వసతిగృహ విద్యార్థినులకు ఎటువంటి సమస్య రాకుండా చూడాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆదేశించారు. మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్ వసతి గృహాన్ని ఆమె బుధవారం సందర్శించారు. ఇక్కడ సమస్యలపై అందిన ఫిర్యాదు మేరకు విద్యార్థినులతో మాట్లాడారు. నీటి సమస్యకు కారణమైన మోటార్‌ను పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం భోజనాన్ని రుచి చూశారు. పిల్లలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మిని ఆదేశించారు. డిప్యూటీ డీఈవో అప్పారావు, ఎంఈవో–2 శివనాయుడు, హాస్టల్ వార్డెన్ బాలామణి, సీఆర్పీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పేరుకే ఉచితం.. జరిమానా ఖాయం

8లో

శివశంకర్‌కు రావిశాస్త్రి పురస్కారం

సీతంపేట (విశాఖ): రావిశాస్త్రి స్మారక పురస్కారం–2024 గానూ ప్రముఖ కవి, విమర్శకులు, కథా రచయిత డాక్టర్ పాపినేని శివశంకర్‌కు ప్రదానం చేయనున్నట్టు రావిశాస్త్రి లిటరరీ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ రాచకొండ నరసింహశర్మ ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 30న రావిశాస్త్రి జయంతి సందర్భంగా విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘురామారావు ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

బెంబేలెత్తిస్తున్న రియాక్టర్లు



వసంత్ కెమికల్స్ ఫ్యాక్టరీ



వసంత్ కెమికల్స్ ఫ్యాక్టరీలో ఎగసి పడుతున్న మంటలు

- మృత్యువాత పడుతున్న కార్మికులు
- ఎన్ని ఘటనలు జరిగినా చర్యలు శూన్యం

అచ్యుతాపురం: పొట్ట చేతపట్టుకొని ఫార్మా కంపెనీల్లో చేరుతున్న కార్మికులకు రియాక్టర్ల భయం వెన్నాడుతోంది. రాంబిల్లిలో వసంత్ ఫార్మా కంపెనీలో 'ఎ' షిఫ్ట్‌లో విధులు నిర్వహిస్తున్న ఒడిశా కార్మికుడు ఆ సమయంలో ఒక్కడే ఉండడంతో అతనిని రక్షించడం వీలు కాలేదు. రియాక్టర్ సమీపంలోని సేఫ్టీ వాల్ దగ్గర పనిచేస్తున్న సదరు కార్మికుడు అక్కడి మంటల వ్యాప్తి ద్వారా విస్తరించిన వాయువుల్ని పీల్చడం, మంటల్లో కాలిపోయి గుర్తుపట్టలేని విధంగా మారడం తోటి కార్మికుల్ని కలచివేసింది. ఇటీవల కాలంలో అచ్యుతాపురం సెజ్ పరిధిలోని కంపెనీల భద్రతా ప్రమాణాలపై పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.పేరు మోసిన రంగుల కర్మాగారంలో పలువురు మృత్యువాత పడిన ఉదంతాన్ని రహస్యంగా ఉంచారు. మరో కంపెనీలో కార్మికుడు జారిపడి మృతి చెందిన సంగతి తెలిసిందే. రెండు మూడు ఫార్మా కంపెనీల్లో సుమారు పది మంది దాకా అగ్నికి ఆహుతయ్యారు. అత్యంత సున్నితమైన రియాక్టర్ల నిర్వహణలో లోపాలు ఉండటం, సాంకేతిక వైఫల్యాలు, నిష్ణాతుల పర్యవేక్షణ లేకపోవడం, ఉష్ణోగ్రతలను క్రమబద్ధీకరించకపోవడం కార్మికుల మృత్యువాతకు కారణం అవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశంపై అధికారికంగా స్పందించేందుకు అధికారులెవ్వరూ ముందుకు రాకపోవడం గమనార్హం. వసంత్ ఫార్మాలో జరిగిన ప్రమాద తీవ్రత తగ్గించేందుకు కూడా ప్రయత్నాలు జరిగాయి. అంతర్జాతీయ దుస్తుల కర్మాగారంలో విష వాయువుల లీకేజీపై ఇప్పటికీ స్పష్టమైన నివేదిక లేకపోవడం గమనార్హం. ప్రమాదం జరిగినప్పుడు హడావిడి చేసే అధికారులు తర్వాత మౌనం దాలుస్తున్నారు. ఫార్మా కంపెనీల వద్ద నిత్య పర్యవేక్షణ, తనిఖీలు ఉండాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఉద్యోగాల కల్పనే కాకుండా కార్మికుల భద్రతకు పెద్దపీట వేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉంది.

ప్రమాద కారణాలపై విచారణ కమిటీ

రెవెన్యూ డివిజనల్ అధికారి ఆధ్వర్యంలో జనరల్ మేనేజర్ ఇండస్ట్రీస్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఫర్ వీఎస్ఈజెడ్, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, ఏపీపీసీబీ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. ఈ కమిటీ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ప్రమాదానికి గల కారణాలపై 7 రోజుల్లోగా నివేదికను సమర్పించాలని ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

సహాయక చర్యల వేగవంతానికి కలెక్టర్ ఆదేశం

తుమ్మపాల: అచ్యుతాపురం సెజ్‌లో వసంత కెమికల్స్ కంపెనీ బ్లాక్ –6 లో బుధవారం జరిగిన సంఘటన చాలా దురదృష్టకరమని కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. సహాయక చర్యల వేగవంతానికి కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హలార్ కోటెడ్ ఆటో క్లేవ్ రియాక్టర్ పేలుడు వల్ల ఈ ప్రమాదం జరిగిందని ఆమె పేర్కొన్నారు.. మృతి చెందిన కార్మికుడిని ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రదీప్ రౌత్ (44)గా గుర్తించారని తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కంపెనీ యాజమాన్యం రూ.35 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు అంగీకరించినట్లుగా ఆమె తెలిపారు. దీంతోపాటు ఈఎస్ఐ బెనిఫిట్స్‌ను కూడా కుటుంబ సభ్యులకు అందించడం జరుగుతుందన్నారు. ప్రమాదంలో మరణించిన వ్యక్తి భార్య, ఇద్దరు పిల్లలు ఒడిశా నుంచి అనకాపల్లి బయలుదేరి వస్తున్నారని చెప్పారు. భవిష్యత్తులో ఇటువంటి దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు.

20, 21న అప్పన్న దర్శన వేళల్లో మార్పులు

ఆర్జిత సేవలు రద్దు



సింహాచలం: ఈ నెల 20న జరిగే గిరి ప్రదక్షిణ, 21న జరిగే వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయ ప్రదక్షిణ పురస్కరించుకుని స్వామి దర్శన వేళల్లో మార్పు చేసినట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. 20, 21 తేదీల్లో అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్టు పేర్కొన్నారు. అలాగే ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన టికెట్లు, సాయంత్రం ఆరాధన టికెట్లు కూడా రద్దు చేసినట్లు చెప్పారు. ఈ రెండు రోజుల్లో ఆలయ నీలాద్రి గుమ్మం నుంచే భక్తులకు దర్శనాలు లభిస్తాయని తెలిపారు. ముఖ్యంగా 20న గిరి ప్రదక్షిణ చేసి అదే రోజు రాత్రికి తిరిగి సింహాచలం చేరుకునే భక్తుల సౌకర్యార్థం రాత్రి 10 గంటల వరకు దర్శనాలు కల్పిస్తామన్నారు. 21న ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు సుప్రభాతసేవ, 2 గంటల నుంచి 3 గంటల వరకు తుది విడత చందన సమర్పణ ఉంటుందన్నారు. ఆ రోజు తెల్లవారు జామున 3 గంటల నుంచి ఆలయ ప్రదక్షిణలకు అనుమతి ఇస్తున్నట్టు వెల్లడించారు. ముందురోజు గిరి ప్రదక్షిణ చేసి సింహగిరికి చేరుకున్న భక్తులందరికీ ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిరిరామంగా దర్శనాలు అందిస్తామన్నారు. సాయంత్రం 4గంటల నుంచి 5.30 గంటల వరకు ఢిల్లీ ఉత్సవం నిర్వహిస్తామని, ఆ సమయంలో దర్శనాలు లభించవని స్పష్టం చేశారు. తిరిగి సాయంత్రం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకు, తిరిగి రాత్రి 8.30 గంటల నుంచి 9 గంటల వరకు దర్శనాలు లభిస్తాయన్నారు.

20న సాయంత్రం 4 గంటలకు పుష్పరథం ప్రారంభం

ఆషాఢ చతుర్దశిని పురస్కరించుకుని ఈ నెల 20న సాయత్రం 4 గంటలకు కొండదిగువ తొలిపావంచా నుంచి స్వామి పుష్పరథం ప్రారంభమవుతుందని ఈవో తెలిపారు. సింహగిరి చుట్టూ ఉన్న 32 కిలోమీటర్ల రథం ప్రదక్షిణ చేసి తిరిగి రాత్రి 10 గంటలకు సింహాచలం చేరుకుంటుందని వెల్లడించారు.

కొండెంపూడిలో టీడీపీ నాయకుల దౌర్జన్యం

- డీ పట్టా భూముల ఆక్రమణకు యత్నం
- సరుగుడు మొక్కలు, పశుగ్రాసం ధ్వంసం



సరుగుడు మొక్కలను ధ్వంసం చేసి దున్నేసిన పొలం



ప్రభుత్వ భూమిగా బోర్డుల ఏర్పాటు

బుచ్చెయ్యపేట: అధికారంలోకి రాగానే టీడీపీ నాయకులు దాడులు, దౌర్జన్యాలతో రెచ్చిపోతున్నారు. తాజాగా బుచ్చెయ్యపేట మండలం కొండెంపూడిలో డీ పట్టా భూములను దౌర్జన్యంగా దున్నేశారు. సరుగుడు మొక్కలను, పశుగ్రాసం ధ్వంసం చేశారు. 15 ఏళ్ల క్రితం ఇక్కడ సర్వే నంబర్ –5లో ఆరెకరాల డీ ఫారం భూములకు గాజువాకకు చెందిన కడియాల రామారావు, సాంబశివరావులకు అప్పటి ప్రభుత్వం పట్టాలు అందజేసింది. వీరు కొన్నాళ్లు స్థానికంగా ఉండి తర్వాత గాజువాక వెళ్లిపోయారు. తర్వాత తమ భూములను కొండెంపూడికి చెందిన రైతులు లంకా ప్రసాద్, రాము, సోమిరెడ్డి రాము, గొల్లవిల్లి ఈశ్వరరావు, జానకీరామ్, పినపాల రాములతో సాగు చేయించుకుంటున్నారు. అయితే గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ అదట్రా సత్యనారాయణ, టీడీపీ నాయకులు మహేష్, శ్రీను తదితరులు సదరు భూములపై కన్నేసిన నేపథ్యంలో బుధవారం జేసీబీ, ట్రాక్టర్లతో వచ్చి ఫెన్సింగ్ ధ్వంసం చేశారు. రెండు నెలల క్రితం నాటిన సరుగుడు మొక్కలను తొక్కించేశారు. ఇక్కడ షెడ్డు నిర్మించుకుని ఆవులు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్న గొల్లవిల్లి ఈశ్వరరావుకు చెందిన పశుగ్రాసం ధ్వంసం చేశారు. ఈ విధంగా దౌర్జన్యం చేయడంపై స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇవే భూములు కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) భూ నిర్వాసితులకు ఇస్తామన్నారని, వాటిని వీరు ఆక్రమించారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల వాగ్వాదంతో ఎస్ఐ డి. ఈశ్వరరావు తమ సిబ్బందితో వారిని శాంతింప చేశారు. రెవెన్యూ అధికారుల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ వివాదాన్ని ముందుగానే గుర్తించిన రెవెన్యూ అధికారులు రెండు రోజుల క్రితం అక్కడ ప్రభుత్వ భూమిగా బోర్డులు పాతిపెట్టినా, వాటిని తొలగించి దౌర్జన్యం చేయడం గమనార్హం.

టీడీపీ నాయకులపై ఫిర్యాదు

ఈ విషయంపై వీఆర్వో సత్యనారాయణను సంప్రదించగా, ప్రస్తుతం డీ పట్టాదారులు సాగులో లేనందున ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేయాలని తహసీల్దారు శ్రీకాంత్ ఆదేశించారన్నారు. ఆ మేరకు వీఆర్ఏతో కలిసి వివాదాస్పద భూముల్లో మరలా ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేయించామన్నారు. టీడీపీ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.


రైల్వేస్టేషన్‌లో స్నిఫర్ డాగ్స్‌తో తనిఖీలు



ప్లాట్‌ఫాంపై స్నిఫర్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఈబీ బృందం

తాటిచెట్లపాలెం (విశాఖ): విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం పోలీస్ కమిషనర్ సంఖబ్రత బాగ్చి ఆదేశాలతో స్నిఫర్ డాగ్స్‌తో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, అడిషనల్ ఎస్పీ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోల ఆధ్వర్యంలో గంజాయి నియంత్రణలో భాగంగా విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. రైల్వేస్టేషన్‌లో పలు ప్లాట్‌ఫాంలు, వెయిటింగ్ హాల్స్, పార్సిల్ కార్యాలయాల్లో తనిఖీలు జరిగాయి. ఎస్ఈబీ సీఐలు టి.వెంకటప్పలనాయుడు, సిహెచ్ రాజులునాయుడు, ఎస్ఐ ఎస్.ముసలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవిద్య ఉపాసన తరగతులు ప్రారంభం



శ్రీవిద్య ఉపాసన తరగతుల్లో పాల్గొన్న దేశ విదేశాలకు చెందిన అభ్యాసకులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో శ్రీవిద్య ఉపాసనలో మిడ్ లెవెల్ కోర్స్ బుధవారం ప్రారంభించినట్టు గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో ఈ శిక్షణ అందించనున్నట్టు చెప్పారు. దేశ విదేశాల నుంచి వచ్చిన 16 మంది విద్యార్థులకు అన్నపూర్ణమ్మ చేతుల మీదుగా గురుమంత్ర దీక్ష ఇచ్చి తరగతులు ప్రారంభించారు. దీక్షలో సౌదీ అరేబియా, యూఎస్ఏలతోపాటు దేశంలోని వివిధ నగరాల నుంచి వచ్చిన వారు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెద్దేరు జలాశయంలో పెరిగిన నీటిమట్టం

• 200 క్యూసెక్కుల నీరు విడుదల

మాడుగుల రూరల్ : మండలంలో రావిపాలెం వద్ద పెద్దేరు జలాశయంలో నీటి మట్టం క్రమేపి పెరుగుతుంది. ఆడపా, దడపా కురుస్తున్న వర్షాలకు జలాశయంలో పెరుగుతున్న నీటి మట్టాన్ని దృష్టిలో ఉంచుకుని జలాశయం నుంచి బుధవారం రాత్రి వర్షపు నీరు 200 క్యూసెక్కులు నీటిని స్పిల్‌వే గేట్లు నుంచి దిగువకు విడుదల చేశారు. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 137 మీటర్లు కాగా, బుధవారం సాయంత్రం నాటికి 136.50 మీటర్లకు చేరింది. కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి 120 క్యూసెక్కులు నీరు చేరుతుందని జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

సెప్టెంబర్‌లో టైపు రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షలు

తగరపువలస : రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 35 టైప్ పరీక్షా కేంద్రాల్లో టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా టైప్ రైటింగ్ అండ్ షార్ట్ హ్యాండ్ అసోసియేషన్ సభ్యుడు బల్లా వెంకటరావు తెలిపారు. సెప్టెంబర్ 28, 29న తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషలలో లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలతోపాటు ఇంగ్లిష్ జూనియర్ గ్రేడ్‌లలో టైప్ రైటింగ్ పరీక్షలు నిర్వహించనున్నారని తెలిపారు. అలాగే అదే నెల 21, 22న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 6 కేంద్రాల్లో షార్ట్ హ్యాండ్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. షార్ట్ హ్యాండ్ పరీక్షా కేంద్రాన్ని విజయవాడలో రద్దు చేసి గుంటూరులో నిర్వహిస్తారన్నారు. పరీక్ష లకు ఇంకా 70 రోజుల వ్యవధి ఉన్నందున అభ్యర్థులు గుర్తింపు పొందిన టైప్ ఇన్‌స్టిట్యూట్‌లను సంప్రదించి సమయం వృథా చేసుకోకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 96522 76443లో సంప్రదించాలని కోరారు.

23 నుంచి స్పెషల్ కేటగిరీ విద్యార్థుల పత్రాల పరిశీలన

మద్దిలపాలెం(విశాఖ): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి స్పెషల్ కేటగిరీ విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను ఈ నెల 23, 24, 25 తేదీల్లో పరిశీలిస్తున్నట్లు మద్దిలపాలెంలోని డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. స్పెషల్ కేటగిరీలో ఎన్‌సీసీ, స్పోర్ట్స్, పీహెచ్, ఎక్స్‌ట్రా కరిక్యులర్, క్యాప్(మాజీ సైనికుల పిల్లలు) ఉంటారన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన స్పెషల్ కేటగిరీ విద్యార్థులు క్రిష్ణా కళాశాలలో జరిగే ధ్రువీకరణపత్రాల పరిశీలనకు హాజరుకావాలని సూచించారు.

పేరుకే ఉచితం.. జరిమానా ఖాయం

• బాబు గారి మాటలకు అర్థాలు వేరు
• ఇసుక రవాణాపై ఆంక్షలు
• అనుమతుల్లేవని వాహనాల సీజ్
• భారీ అపరాధ రుసుం విధింపు
• బెంబేలెత్తుతున్న జనం



ఎస్ఈబీ అధికారులు సీజ్ చేసిన ఇసుక వాహనాలు

నర్సీపట్నం: ప్రభుత్వం విధిస్తున్న అపరాధ రుసుంతో ఇసుక రవాణాదారులు బెంబేలెత్తిపోతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానం ప్రకటనలకే పరిమితం కావడంతో ప్రజలు ఉసూరుమంటున్నారు. మీకు ట్రాక్టర్ ఉన్నా..నాటు బండి ఉన్నా మీకు సమీపంలోని ఇసుక రీచ్‌లు, వాగుల నుంచి పైసా ఖర్చు లేకుండా ఇసుక తెచ్చుకోవచ్చని సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటన క్షేత్ర స్థాయిలో కానరాలేదు. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఇసుక విధానం మార్గదర్శకాలకు అనుగుణంగా ఇసుక ఎక్కడ నుంచి తెచ్చుకున్నా అనుమతులు తప్పనిసరని పేర్కొంది. ప్రభుత్వ మార్గదర్శకాలతో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు ఇసుక అక్రమ రవాణా పేరుతో కొరడా ఝళిపిస్తున్నారు. గత ప్రభుత్వంలో కోనసీమ, రాజమండ్రి జిల్లాల నుంచి లారీల్లో ఇసుక తెచ్చుకునేవారు. లారీ వెళ్లడానికి వీలుపడని ప్రాంతాలకు లారీల్లోని ఇసుకను ట్రాక్టర్ల ద్వారా సమీప ప్రాంతాలకు తీసుకువెళ్లేవారు. ప్రస్తుతం నర్సీపట్నం ఇసుక యార్డు తెరవకపోవడంతో కోనసీమ, రాజమండ్రి రీచ్‌ల నుంచి లారీలతో ఇసుకను ట్రాక్టర్లతో పరిసర ప్రాంతాల్లో నిర్మాణదారులకు సరఫరా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఇసుక విధానంతో స్థానికంగా ఇసుకను సరఫరా చేస్తున్న ట్రాక్టర్లపై అధికారులు కొరడా ఝళిపిస్తున్నారు. రాజమండ్రి నుంచి నర్సీపట్నం ఇసుకతో వచ్చిన రెండు భారీ వాహనాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు. పర్మిట్‌లో సరైన వివరాలు లేకపోవడంతో ఎస్ఈబీ సీఐ సురేష్‌కుమార్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి 12 టైర్ల ఇసుక లారీ, 10 టైర్ల టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని సీజ్ చేశారు. టిప్పర్‌కు రూ.25 వేలు, లారీకి రూ.50 వేలు అపరాధ రుసుం విధించారు. ఈనెల 13న స్థానికంగా ఇసుక సరఫరా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను తనిఖీ చేసి బిల్లులు, రవాణా అనుమతులు లేవంటూ ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10 వేలు చొప్పున అపరాధ రుసుం విధించారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్



తాటిచెట్లపాలెం (విశాఖ) : పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తుండడంతో రీ షెడ్యూల్ చేశామని వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 12.20 గంటలకు సంత్రగచ్చిలో బయల్దేరాల్సిన సంత్రగచ్చి - సికింద్రాబాద్ (07222) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు ఏడున్నర గంటలు ఆలస్యంగా రాత్రి 7.50 గంటలకు బయల్దేరింది. బుధవారం మధ్యాహ్నం 11.25 గంటలకు షాలిమర్‌లో బయల్దేరాల్సిన షాలిమర్ - హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ గంటున్నర ఆలస్యంగా మధ్యాహ్నం 1 గంటకు బయల్దేరింది. బుధవారం మధ్యాహ్నం 12.15 గంటలకు షాలిమర్‌లో బయల్దేరాల్సిన షాలిమర్ - సికింద్రాబాద్ (22849) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నాలుగున్నర గంటలు ఆలస్యంగా సాయంత్రం 4.45 గంటలకు బయల్దేరింది. బుధవారం రాత్రి 7 గంటలకు ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌లో బయల్దేరాల్సిన ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - హౌరా (12840) ఎక్స్‌ప్రెస్ సుమారు మూడు గంటలు ఆలస్యంగా రాత్రి 9.45 గంటలకు బయల్దేరింది.

విశాఖ, కృష్ణా జట్ల విజయకేతనం

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం మైదానాలే వేదికగా నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో కృష్ణా, విశాఖ, సెంట్రల్ జోన్ జట్లు విజయం సాధించాయి. వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానంలో బుధవారం నిర్వహించిన మ్యాచ్‌లో కడప, కృష్ణా జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కృష్ణా జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 46.5 ఓవర్లలో 190 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విశాఖపట్నం, రెస్టాఫ్ సౌత్ జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సౌత్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. జట్టులో మన్విత్ రెడ్డి 70 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు 37.3 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని ఈశ్వర్ రిత్విక్ 69, హ్రితిక్ వర్మ 53, యువన్ 57 పరుగులు చేశాడు. దీంతో విశాఖ జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో రెస్టాఫ్ నార్త్ జోన్ పై రెస్టాఫ్ సెంట్రల్ జట్టు విజయం సాధించింది.

ఏఎంఏఎల్ కళాశాలలో సోలార్ ప్లాంట్ ప్రారంభం



సోలార్ ప్లాంట్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కర్రి అప్పారావు, పూర్వ విద్యార్థులు

తుమ్మపాల : ఎందరో నిరుపేద, మధ్య తరగతి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఘనత ఏఎంఏఎల్ కళాశాల సొంతమని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్యశాఖ రాష్ట్ర సంయుక్త సంచాలకుడు కర్రి అప్పారావు అన్నారు. ఏఎంఏఎల్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నాలుగు కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ ఎనర్జీ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.3.5 లక్షలతో సోలార్ ప్లాంట్‌కు ఖర్చు చేసినట్టు తెలిపారు. వ్యాపారవేత్త పెంటకోట సూరిబాబు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా మరింతగా మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, సభ్యుడు వాసిరెడ్డి బాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు, పర్యవేక్షకులు పి. అనురాధ, పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు బొడ్డేడ అప్పారావు, పెనుమత్స కృష్ణంరాజు, కె.ఎస్.వి.సత్యనారాయణ, కొణతాల రాజేంద్రప్రసాద్, ఎస్.వి.నరసింహం, ఎస్.జగ్గారావు, బాబూజీ, ఏవీఎస్ ప్రసాద్, మళ్ల కోటేశ్వరరావు, ఎన్.కృష్ణబాబు, సిహెచ్. ధనంజయ, ఫిజిక్స్ హెడ్ నిరంజన్ కుమార్, కె.ఎ.ఎస్ నాయుడు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక



రాష్ట్ర జట్టుకు ఎంపికైన సాఫ్ట్‌బాల్ క్రీడాకారులతో నిర్వాహకులు

అగనంపూడి (విశాఖ): వచ్చే నెలలో గుంటూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక బుధవారం గాజువాక మండలం, కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టారు. వాల్తేర్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సారథ్యంలో కణితి హైస్కూల్‌లో నిర్వహించిన ఎంపికల్లో విశాఖ జిల్లాలోని వివిధ కళాశాలలు, పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మామిడి రమణ మాట్లాడుతూ వచ్చే నెల 10వ తేదీ నుంచి మూడు రోజుల పాటు గుంటూరు జిల్లా వినుకొండ గుడ్‌షెపర్డ్ పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపికైన జట్టు పాల్గొనుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సూర్యనారాయణ, కణితి హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎం.మన్నాజీ, పీడీలు నారాయణరావు, లోవరాజు, దేముడుబాబు, భవానీ, రవి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారూఫ్

ఎస్.రాయవరం: గెడ్డపాలెం గ్రామానికి చెందిన టైల్స్ మేస్త్రీ రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని దుర్మరణం చెందాడు. తుని రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారూఫ్ తెలిపిన వివరాలివి. టైల్స్ వర్కు మేస్త్రిగా పనిచేస్తున్న కర్రి దుర్గ (40) రోజువారీ పనుల నిమిత్తం బుధవారం భీమవారం గ్రామానికి వెళుతుండగా ట్రాక్ దాటే క్రమంలో రైలును గమనించకపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తుని నుంచి విశాఖ వైపు వెళుతున్న రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా వివరాలు తెలుసుకుని అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్టు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, తొమ్మిదేళ్ల బాబు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కండక్టర్‌పై ప్రయాణికుడి దాడి

• కేసు నమోదు

నర్సీపట్నం : నర్సీపట్నం ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ చిట్టిబాబుపై చేయి చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని టౌన్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో నుంచి తోటకూరపాలెం బస్సు బయలుదేరింది. అదే బస్సులో మాకవరపాలెం మండలం, కొండల అగ్రహారానికి చెందిన ఎస్.వెంకటేష్ బస్సులో ప్రయాణిస్తున్నాడు. విధి నిర్వహణలో ఉన్న కండక్టర్ చిట్టిబాబు అతడిని టిక్కెట్ తీసుకోమని కోరగా, వెంకటేష్ కండక్టర్‌తో దురుసుగా ప్రవర్తించి చేయి చేసుకున్నాడు. ఈ ఘటనపై కండక్టర్ నర్సీపట్నం టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

12 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి 12 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ డి. ఈశ్వరరావు బుధవారం రాత్రి తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడి చేసి వారి వద్ద రూ.18,340 స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైలు ఢీకొని 50 ఏళ్ల వ్యక్తి మృతి



దుర్ఘటన స్థలంలో మృతదేహం పరిశీలిస్తున్న పోలీసులు

కశింకోట : నరసింగబిల్లి-బయ్యవరం రైల్వే స్టేషన్ల మధ్య బుధవారం గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని 50 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్టు రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. మృతదేహం నుజ్జు నుజ్జు అయిందని, అతని వివరాలు తెలియరాలేదన్నారు. అయితే సిమెంట్ రంగు షార్ట్ ధరించి ఉన్నాడని, మృతదేహానికి కొంత దూరంలో పెన్నా సిమెంట్ ముద్ర కలిగిన నీలం రంగు టీషర్టు పడి ఉందన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రిలో బంధువుల కోసం భద్రపరిచామన్నారు. వివరాలకు సెల్ నెంబర్లు 9494887786, 9490619020 సంప్రదించాలన్నారు.

సముద్రంలో బోటు బోల్తా

• సురక్షితంగా బయటపడ్డ మత్స్యకారులు
• బోటు యజమానికి రూ.40 లక్షల నష్టం

మహారాణిపేట(విశాఖ): చేపల వేట కోసం విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి పూడిమడక వైపు వెళ్లిన బోటు.. అప్పికొండ వద్ద ప్రమాదానికి గురైంది. బుధవారం సముద్రంలో అలల తాకిడి అధికంగా ఉండడంతో ఈ ప్రమాదం జరిగింది. బోటులో ఉన్న మత్స్యకారులు సముద్రంలోకి దూకి.. ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. వివరాలివీ.. ఈ నెల 14న ఫిషింగ్ హార్బర్ నుంచి దూడ దాసుకు చెందిన ఐఎన్‌డీ-ఏపీ-వీ5-ఎంఎం-245 బోటు వేటకు వెళ్లింది. అప్పికొండ వద్ద బుధవారం మత్స్యకారులు వేట సాగిస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటల తర్వాత వాతావరణంలో మార్పులతో అలల తాకిడి పెరిగింది. ఇంకో వైపు ఈదురు గాలులు విపరీతంగా వీయడంతో ఈ బోటు బోల్తా పడింది. ప్రమాద సమయంలో బోటులో డ్రైవర్‌తో పాటు 8 మంది కలాసీలు ఉన్నా రు.

అప్పటికే వేటాడిన మత్స్య సంపద కూడా అందులోనే ఉంది. కాగా.. ఈ ఘటనలో బోటులో ఉన్న ఎనిమిది మంది మత్స్యకారులు సముద్రంలో దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈదుకుంటూ అప్పికొండ ఒడ్డుకు చేరుకున్నారని ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ తెలిపారు. ఈ ప్రమాదంలో బోటు యజమానికి రూ.40 లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు. ఈ ఘటనపై మత్స్యశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపి.. బోటు యజమానికి నష్టపరిహారం చెల్లించాలని జానకీరామ్ కోరారు.

జేగంటలు గణగణ



బోరుబావి వద్ద స్నానమాచరిస్తున్న భక్తులు

• ఘనంగా జగన్నాథుని పండగ
• గోనలతో ఊరేగింపు



జేగంటలు కొడుతున్న భక్తులు

మునగపాక : మండల కేంద్రంలో సుభద్ర,బలభద్ర సమేత జగన్నాథ స్వామి పండగ బుధవారం ఘనంగా జరిగింది. భక్తులు తమ ఇళ్ల నుంచి గోనలతో ఊరేగింపుగా సంతబయిల బోరుబావి వద్దకు చేరుకున్నారు. దారి పొడవునా స్నానం చేస్తూ జే గంటలు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా బయలుదేరారు. బోరుబావి వద్ద స్నానమాచరించి అరటిపళ్లను భక్తులకు అందజేశారు. ఊరేగింపులో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కల్కి అవతారంలో జగన్నాథుడు భక్తులకు దర్శనమిచ్చారు.

• భక్తిశ్రద్ధలతో మొహర్రం



మాతం ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లింలు

డాబాగార్డెన్స్(విశాఖ), నక్కపల్లి, అచ్యుతాపురం: ఉమ్మడి విశాఖ జిల్లాలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో బుధవారం మొహర్రం జరుపుకొన్నారు. విశాఖలో అంజుమన్ హుస్సేని మసీదు సంఘం అధ్యక్షుడు ఘాజీ అబ్బాస్, ఉపాధ్యక్షుడు షాహిద్ హుస్సేన్, కార్యదర్శి రజా ఆఘా, కోశాధికారి అక్బర్ నేతృత్వంలో చెంగల్రావుపేటలోని మసీదు నుంచి అమరులను స్మరించుకుని.. మాతం(రక్తతర్పణం) ప్రదర్శన నిర్వహించారు. మసీదు నుంచి ప్రారంభమైన మాతం ఏవీఎన్ కాలేజ్, కాలేజ్ డౌన్‌రోడ్డు, మెయిన్‌రోడ్డు, టౌన్‌కొత్తరోడ్డు, పంజా జంక్షన్ మీదుగా తిరిగి మసీదుకు చేరుకుంది. కులమతాలకతీతంగా పలువురు దట్టీలు సమర్పించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మాతం ప్రదర్శన, మొహర్రం సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నక్కపల్లి మండలం చినబోదిగల్లం, పెదబోది గల్లం, అలాగే అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో మొహర్రం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు.

ఆక్వా సాగు అభివృద్ధిపై అధ్యయనం

• శ్రీలంక మత్స్య, పోర్టుల శాఖ మంత్రి డగ్లస్ దేవానంద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీలంక మంత్రి

పాయకరావుపేట : శ్రీలంకలో ఆక్వాసాగును అభివృద్ధి చేయడం కోసం తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో పర్యటించి హేచరీలలో అధ్యయనం చేస్తున్నట్టు శ్రీలంక మత్స్య, పోర్టుల శాఖ మంత్రి డగ్లస్ దేవానంద్ తెలిపారు. ఆయన అధ్యయన బృందంతో కలిసి మండలంలోని పెంటకోట సమీపంలో ఉన్న శిల్పా హేచరీని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీలంకలో 1400 హెక్టార్లలో 30 హేచరీలు ఉన్నట్టు తెలిపారు. వాటిలో పండుకప్ప, పీతల సాగుతో పాటు నాణ్యమైన రొయ్యలు ఉత్పత్తి చేయడంపై ఈ రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న హేచరీలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా అంతర్వేది, రామగుండంలోని హేచరీలను కూడా సందర్శించడం జరుగుతుందని తెలిపారు. ఆక్వా సాగుకు తీసుకుంటున్న అంశాలు, ఉత్పత్తికి అవలంభిస్తున్న చర్యలపై ఆయా హేచరీల యాజమాన్యాలను అడిగి తెలుసుకుంటున్నట్టు తెలిపారు. ఈయనతో పాటు శ్రీలంక మత్స్యశాఖ బృందం సభ్యులు డాక్టర్ అరుల్ రవీంద్రన్, నవీన్‌వర్మ, శిల్పా హేచరీ యాజమాన్యం పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్

ఎనిమిది మందికి స్వల్ప గాయాలు



ప్రమాదంలో పాక్షికంగా దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

పాడేరు : పాడేరు-జి.మాడుగుల ప్రధాన రహదారిలో వాకపల్లి వద్ద బుధవారం సాయంత్రం ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. పాడేరు నుంచి ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు గూడెం వెళ్తుండగా వాకపల్లి వద్ద హైవే రహదారి పనుల్లో ఉన్న ఓ టిప్పర్‌ను రివర్స్ చేస్తున్న క్రమంలో వెనుక వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును ముందు భాగంలో ఢీకొంది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న సుమారు ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సు ముందు భాగం దెబ్బతింది. ప్రయాణికులను వేరే బస్సులో గూడెంకు తరలించారు. ఈ సంఘటనతో పాడేరు-జి.మాడుగుల మార్గంలో సుమారు అర గంట సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

సీలేరు: గూడెంకొత్తవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ ఊడలమర్రి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కాకనూరు, మతం భీమవరానికి చెందిన ఐదుగురు రెండు బైకులపై ఎదురెదురుగా వస్తుండగా ఊడలమర్రి వద్ద ఆ వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన ఐదుగురిని ధారకొండ పీహెచ్‌సీకి తరలించారు. వీరిలో వంతల చంద్రబాబు, సీరిబాల ధర్మరాజుల పరిస్థితి విషమంగా ఉండడంతో చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

• బంగారం, నగదు అపహరణ



చోరీపై వివరాలు సేకరిస్తున్న పోలీసు కానిస్టేబుల్

కోటవురట్ల: పట్టపగలే ఓ ఇంట్లో దొంగలు పడి అందినకాడికి దోచుకుపోయారు. బాధితులు లబోదిబో అంటూ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాలివి. చౌడువాడ గ్రామానికి చెందిన గల్లా రమణ మంగళవారం ఉదయం గాజువాకలో ఉన్న తన కూతురును చూడడానికి వెళ్లారు. అతని భార్య గల్లా లక్ష్మి అదే రోజు ఉదయం 9 గంటల సమయంలో పొలంలోకి వెళ్లి తిరిగి సాయంత్రం 6 గంటలకు ఇంటికొచ్చారు. ఇంటి వెనక తలుపులు తెరిచి ఉండడంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లగా బీరువా తెరిచి చెల్లాచెదురుగా పడి ఉన్న దుస్తులను చూసి ఆందోళనతో బీరువా తెరిచి చూడగా అందులో దాచిన పావు తక్కువ నాలుగు తులాల బంగారు ఆభరణాలు, 40 తులాల వెండి వస్తువులు, రూ.38,500 నగదు అపహరణకు గురైనట్టు గుర్తించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి దోచుకుపోయినట్టు భావించి బుధవారం కోటవురట్లలోని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలు గల్లా లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. క్లూస్ టీమ్ సంఘటన స్థలానికి వెళ్లి ఆధారాల కోసం పరిశీలించింది.

క్లుప్తంగా

నేడు లక్ష్మీ నృసింహస్వామికి స్వర్ణ సంపెంగలతో అర్చన

అనకాపల్లి : స్థానిక గవరపాలెం దిబ్బవీధిలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి గురువారం స్వర్ణ సంపెంగ పుష్పాలతో అర్చన చేయనున్నట్లు ఆలయ ప్రతినిధి మళ్ల రామచంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకూ అలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి సత్యప్రసాదాచార్యులు ఈ కార్యక్రమం నిర్వహిస్తారని అన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

త్వరలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశాలు



పార్టీ శ్రేణులతో సమావేశం అయిన మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి : గ్రామీణ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశాలు త్వరలో నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో నాయకులతో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో గ్రామీణ స్థాయి నుంచి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొడ్డేడ శివ, గైపూర్ రాజు, కల్యాణ్, బొండా శంకరరావు, కొంకి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



కశింకోట : వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో స్వామిని తొలి ఏకాదశి సందర్భంగా అందంగా అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి శ్రీరామచరణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

కశింకోట : మండలంలోని ముస్లింలు బుధవారం భక్తిశ్రద్ధలతో మొహర్రం జరుపుకున్నారు. మహ్మద్ ప్రవక్త మనుమడు ఇమాం హుస్సేన్‌ను చంపిన రోజుగా మొహరంను ముస్లింలు పాటిస్తారు. ఈ సందర్భంగా తమ ఇళ్లలో ముస్లింలు ఆయనకు నివాళి అర్పించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 16 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	--	--
రెండో రకం	--	--
మూడోరకం	2,800	3,000

అనకాపల్లి సినిమాలు

మల్లిమొగ్గలు	:రాజా
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-2
భారతీయుడు 2	:షిర్డిసాయి
భారతీయుడు 2	:పర్తిసాయి
మనమే	:వెంకటేశ్వర
తంత్ర	:శ్రీసత్య
సారంగదరియా	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-16 యూనిట్లు, ఓ పాజిటివ్-13 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 363 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

విద్యతోనే ఉన్నత శిఖరాలకు..



ఈ ఏడాది పదో తరగతిలో 588 మార్కులు సాధించాను. అనకాపల్లి మండలంలో ప్రథమస్థానం దక్కింది. జిల్లాలో మూడో స్థానం పొందాను. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నగదు ప్రోత్సాహంతో సత్కరించారు. నాది అనకాపల్లిలోని గాంధీనగరంలో గల రామాలయం వీధి. తండ్రి కిరణ్, తల్లి విజయ. మా నాన్నగారు రోజువారీ కూలీ. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలతో నూజివీడు ట్రిపుల్ ఐఐటీలో సీటు సాధించాను. సీఎస్‌సీ పూర్తి చేసి కంప్యూటర్ రంగంలో స్థిరపడాలని ఆశిస్తున్నాను. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా చదవితే జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చు.

– కరణం సంజన

ప్రతిభ కనబరిచిన సందేష్..



పట్టణంలో గాంధీనగరానికి చెందిన మేడం వరుణ్ సందేష్ ఇటీవల విడుదలైన ఐఐటీ ఫలితాల్లో నూజీవీడుకు ఎంపిక కావడంతో తల్లిదండ్రులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన సందేష్ తండ్రి సంతోష్ టైలరింగ్ షాపులోను, తల్లి మెడికల్ షాపులో పని చేస్తున్నారు. సమీపంలోని గాంధీనగరం మున్సిపల్ ప్రభుత్వ పాఠశాలలో ఈ ఏడాది పదవ తరగతిలో 587/600 మార్కులతో మొదటి స్థానం సాధించాడు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లోను ప్రతిభ కనబరచడంతో ఉన్నత శిఖరాలకు చేరుకోగలడని అందరు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

–మేడం వరుణ్ సందేష్

విద్యా కుసుమాలు

దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రవేశ పెట్టిన ట్రిపుల్‌ఐటీ (రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ)లు ఎంతో మంది విద్యార్థులను భావి భారత ఇంజినీర్లుగా తీర్చి దిద్దుతున్నాయి. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి , ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదివి అత్యధిక మార్కులు సాధించి తమ ప్రతిభ చూపించిన విద్యార్థులకు ఈ ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఈ ఏడాది నియోజకవర్గానికి చెందిన పలువురు పేద విద్యార్థులు టెన్త్‌లో చక్కటి ప్రతిభ చూపి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పేద, మధ్య తరగతి, వ్యవసాయ కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులకు మహానేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి వేసిన వేసిన బాటలు తమకు వరంగా మారాయని వారంతా ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించి సత్తా చాటిన విద్యార్థులు
- ఫలిస్తున్న రాజన్న ఆశయాలు
- పేద విద్యార్థులకు వరంలా మహానేత స్థాపించిన ట్రిపుల్‌ఐటీలు
- సర్కారు బడుల నుంచి భావి ఇంజినీర్లు

అనకాపల్లి/కశింకోట/తుంపాల : ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పదో తరగతి విద్యార్థులు ఈ ఏడాది రాష్ట్రంలో ట్రిపుల్ ఐటీలో ఉచిత ఇంజినీరింగ్ సీట్లు సాధించారు. అనకాపల్లి పట్టణం, మండలంలో మొత్తం 13 మంది విద్యార్థుల్లో నలుగురు బాలురు, తొమ్మిది మంది బాలికలు ఇంజినీరింగ్‌లో సీట్లు పొందారు. అత్యధికంగా జీవీఎంసీ పట్టణ పరిధిలో వేల్పులవీధి టౌన్ బాలికల హైస్కూల్లో కరణం సంజన, జాన లహరి, కుడిపూడి లక్ష్మీనవ్య, కోరం రేష్మిత ఆపూర్వ, శివకోటి యశోద, కండిపిల్లి కుసుమాంజలి, గవరపాలెం చిన్న హైస్కూల్లో మొగ్గ సత్యవాణి, మళ్ల ప్రవల్లిక, గాంధీనగరం హైస్కూల్లో ఎం.వరుణ్ సందేష్, డి.గణేష్, మహాత్మాగాంధీ జ్యోతిరావుపూలే హైస్కూల్లో పి. మౌళి, ఎస్.ఇంద్ర ఆకాష్, మండలంలో దిబ్బపాలెం హైస్కూల్లో పప్పల వినీల సీట్లు సాధించారు.

కశింకోట మండలం నుంచి 9 మంది..

కశింకోట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి ఈ ఏడాది ట్రిపుల్ ఐటీకి 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిలో ఐదుగురు బాలికలు, నలుగురు బాలురు ఉన్నారు. వీరిలో తేగాడలోని మోడల్ స్కూలు నుంచి ముగ్గురు, నరసింగబిల్లి హైస్కూలు, తాళ్లపాలెం ఏపీ బాలికల గురుకుల పాఠశాల నుంచి చెరో ఇద్దరు, కశింకోట, తాళ్లపాలెం హైస్కూళ్ల నుంచి ఒక్కొక్కరు ఎంపికయ్యారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థుల వివరాలు

స్కూలు పేరు	విద్యార్థి పేరు	ట్రిపుల్ ఐటీ పేరు
నరసింగబిల్లి హైస్కూలు	కలిగెట్ల జయరాజ్	నూజివీడు
నరసింగబిల్లి హైస్కూలు	కారు యశ్వంత్	నూజివీడు
తాళ్లపాలెం హైస్కూలు	వై.ఆర్. అభిరాం	నూజివీడు
కశింకోట బాలికలహైస్కూలు	బండారు శ్రావణి	నూజివీడు
తేగాడ ఏపీ మోడల్ స్కూలు	ఎస్. రోషిణి	శ్రీకాకుళం
తేగాడ ఏపీ మోడల్ స్కూలు	ఎస్. వింధ్య	నూజివీడు
తేగాడ ఏపీ మోడల్ స్కూలు	ఏవీవీ శివ	నూజివీడు
ఏపీ బాలికల గురుకుల పాఠశాల, తాళ్లపాలెం	కె. మౌనిశ్రీ	శ్రీకాకుళం
ఏపీ బాలికల గురుకుల పాఠశాల, తాళ్లపాలెం	సీహెచ్ మాలిక	శ్రీకాకుళం

ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తా..



నేను పదో తరగతిలో 582 మార్కులు సాధించాను. దీంతో నూజివీడు ట్రిపుల్ ఐఐటీలో సీటు దక్కింది. మండల స్థాయిలో తృతీయస్థానంలో నిలిచాను. ఈసీఈ చదువుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ఉంది. తండ్రి ప్రభుత్వ శాఖలో చిరుద్యోగి. నాన్న పడుతున్న కష్టాలు చూసి బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పట్టుదలగా చదివాను. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు చెప్పినట్లు చదువుకుంటే నాలా అందరూ మంచి మార్కులు సాధిస్తారు.

– జాన లహరి

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు



స్కూల్లో తృతీయస్థానం వచ్చింది. పదో తరగతిలో 576 మార్కులు సాధించాను. తల్లి మణి, తండ్రి సుబ్రహ్మణ్యం రోజుకూలీలు. బీటెక్ పూర్తి చేయాలని ఉంది. ప్రభుత్వ ఉద్యోగం ఆశిస్తున్నాను. కష్టపడి చదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చెప్పారు. తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు చూసి చాలా బాధపడుతున్నాను. 5వ తరగతి వరకూ ప్రైవేట్ పాఠశాలలో చదువుకున్నాను. 6వ తరగతి నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాను. అన్నయ్య వంశీ ఇంటర్ ద్వితీయ పూర్తి చేశాడు.

– కుడిపూడి లక్ష్మీ నవ్య

అధ్యాపకురాలిని కావాలనుకుంటున్నా..



మాది కశింకోటలోని సత్యానగర్. తేగాడలోని మోడల్ స్కూల్లో చదివి టెన్త్ పరీక్షల్లో 581 మార్కులు సాధించాను. శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాను. ఈ నెల 27న చేరుతాను. మాది సామాన్య కుటుంబం. తండ్రి నగేష్ ప్రైవేట్ పరిశ్రమలో కార్మికుడు.

–సామూజు రోషిణి, మోడల్ స్కూల్, తేగాడ, కశింకోట మండలం.

ఇంజినీర్ అవుతా..



ఎంటెక్ చదివి ఇంజినీర్ కావాలని ఆశిస్తున్నాను. నరసింగబిల్లి హైస్కూల్లో చదివి ఈ ఏడాది టెన్త్‌లో అత్యధికంగా 585 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచాను. న్యూజివీడులోని ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాను. మాది సామాన్య వ్యవసాయ కుటుంబం. మా నాన్న శ్రీను వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. తల్లి నాగమణి గృహిణి.

– కలిగెట్ల జయరాజ్, నరసింగబిల్లి హైస్కూలు, కశింకోట మండలం.

ఆనందంగా ఉంది..



తాళ్లపాలెం హైస్కూల్లో టెన్త్ చదివి 583 మార్కులతో న్యూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాను. స్కూల్లో ప్రథమ స్థానం రావడంతో పాటు మండలంలో తృతీయ స్థానం లభించింది. మంచి ఇంజినీర్ కావడమే ధ్యేయం. తండ్రి కృష్ణ తాపీమేస్త్రి, తల్లి నూకరత్నం గృహిణి. పేదరికం నుంచి వచ్చినా ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం ఆనందంగా ఉంది.

– వైఆర్ అభిరాం, తాళ్లపాలెం హైస్కూలు, కశింకోట మండలం.

ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి



మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న సీఐటీయూ నాయకులు

తుమ్మపాల : అచ్యుతాపురం సెజ్‌లోని వసంత కెమికల్స్‌లో రియాక్టర్ పేలిన ఘటనపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి మృతుని కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ నాయకులు ఆర్. శంకరరావు, వి.వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రమాదంలో మృతి చెందిన ఒడిశాకు చెందిన ప్రదీప్‌రౌత్ కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. పారిశ్రామిక ప్రమాదాలపై తీవ్ర నిర్లక్ష్యం నెలకొంటుందని, ఇటీవల కొత్తగా వచ్చిన కలెక్టర్ పారిశ్రామిక అధిపతులతో సమావేశం నిర్వహించిన నాలుగు రోజుల్లోనే ప్రమాదం జరగడం దురదృష్టకరమన్నారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల లోపం, నాసిరకం రేయాక్టర్ల వల్ల ప్రమాదాలు జరిగి వలస కార్మికులు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఈశ్వరరావు, చలపతి పాల్గొన్నారు.

రుద్ర మహాయాగానికి పట్టు వస్త్రాలు

చోడవరం రూరల్: స్థానిక స్వయంభూ గౌరీశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం పద్మశాలీ సంఘ సభ్యులు కుటుంబ సమేతంగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి నక్షత్ర నవగ్రహ పూర్వక పంచాయతన సహిత చండి రుద్ర మహా యాగాన్ని నిర్వహిస్తున్నారు. పద్మశాలీ సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు సప్ప కొండలరావు, పప్పు శ్రీను, గౌరవాధ్యక్షుడు దొడ్డి వీర్రాజు, కార్యదర్శి కోసూరి నారాయణరావు, కోశాధికారి నేమాల హరి, సంయుక్త కార్యదర్శులు వంక సూర, దొడ్డి సత్యనారాయణ, గౌరవ సలహాదారులు బొజ్జ రామారావు, చుక్కల వెంకటరమణ, సభ్యులు పాల్గొన్నారు.

బకాయి జీతాల కోసం కొనసాగుతున్న దీక్షలు



ఆస్పత్రి వద్ద దీక్ష చేస్తున్న ఉద్యోగులు

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేసిన మత్తు వ్యవస విముక్తి విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు తమ బకాయి జీతాలు చెల్లించాలని ఆస్పత్రి వద్ద రిలే దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ 12 నెలల పాటు జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జీతాలు చెల్లించాలన్నారు. రాష్ట్రంలో ఉన్న 25 డ్రగ్ డి-అడిక్షన్ సెంటర్ల పర్యవేక్షణ, బాధ్యతను రాష్ట్రప్రభుత్వం తీసుకోవాలని కోరారు. జీతాలు చెల్లించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ దీక్షల్లో ఉద్యోగులు ఎస్.క్రాంతికుమార్, బి.నాయుడుబాబు, జి.కీర్తన, జి.రాజ్యలక్ష్మి, ఎల్.శ్రీదేవి, చంద్రశేఖర్, ఎస్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నర్సీపట్నం: త్యాగరాజ నాయీబ్రాహ్మణ వాయిద్య కళాకారుల సంఘం నర్సీపట్నం డివిజన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగభూషణంతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సంఘ కార్యకలాపాలు కొనసాగడానికి వీలుగా నూతన అధ్యక్షుడు రూ.10 వేలు విరాళంగా అందజేశారు. నాయీబ్రహ్మణ కులదైవమైన ధన్వంతరి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. వాయిద్య కళా రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సంఘ పెద్దలు పేర్కొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

చోడవరం రూరల్: వికలాంగుల సంక్షేమ సంఘం రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, సభ్యులు క్రమశిక్షణతో మెలగాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ నీలం నాగేంద్రబాబు తెలిపారు. మండల వికలాంగుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం చోడవరంలో సంఘ అధ్యక్షుడు దుగ్గిరాల రవికుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో అచ్యుతాపురం వికలాంగుల సంఘం అధ్యక్షుడు పీఎస్‌టీ పట్నాయక్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఓ రాంబాబు, లయన్స్ సర్వీస్ ప్రెసిడెంట్ ముక్కా రమేష్, ఆర్క్ కార్యదర్శి డీఎస్ ప్రసాద్, ఏఎస్ నాగ భూషణం ముఖ్య వక్తలుగా ప్రసంగించారు. పెన్షన్ల విషయంలో దివ్యాంగులకు అన్యాయం జరగకుండా, స్క్రూటీనీ పేరుతో తొలగింపులకు పాల్పడకుండా కాపాడుకోవలసిన బాధ్యత ఉందన్నారు. వయసు, పర్సంటేజీలతో పని లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ ఉంచాలన్నారు. జిల్లాకు సంబంధించి తక్షణమే దివ్యాంగుల కార్యాలయంతోపాటు సమర్థులైన అధికారుల నియామకం చేపట్టాలని కోరారు. దివ్యాంగుల కోసం పరస్పర సహాయ సంఘాన్ని ఏర్పాటు చేయాలని పలు డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు.

నూతన కార్యవర్గం...

సంఘ సర్వసభ్య సమావేశానంతరం మండల వికలాంగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ గౌరవ అధ్యక్షునిగా దుగ్గిరాల రవికుమార్, అధ్యక్షుడిగా శరగడం భూషణం, ఉపాధ్యక్షురాలిగా సాలాపు కుమారి, కార్యదర్శిగా సింగంపల్లి అనంత్, కోశాధికారిగా గొల్లమాల మంగతోపాటు మరికొంత మంది కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పశుగ్రాస విత్తనాలు సిద్ధం



లారీ నుంచి విత్తనాలు దించుతున్న దృశ్యం

చీడికాడ: పాడి రైతులకు రాయితీ పై పశుగ్రాస విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని పెదగోగాడ పశువైద్యాధికారి కె.రాఘవమ్మ బుధవారం తెలిపారు. వంద కిలోల మొక్కజొన్న, 500 కిలోల కాకిజొన్న విత్తనాలు అన్ని రైతు సేవా కేంద్రాల్లో విక్రయిస్తామన్నారు. మొక్కజొన్న కిలో రూ.68, కాకిజొన్న రూ.92గా నిర్ధారించి రైతులకు అందించనున్నట్లు తెలిపారు.

పశుగ్రాస విత్తనాల విక్రయం

మాడుగుల రూరల్: మండలంలో పశుగ్రాస విత్తనాలు 900 కిలోల కాకిజొన్న, 600 కిలోల మొక్కజొన్న 75 శాతం సబ్సిడీపై విక్రయిస్తున్నామని మాడుగుల పశువైద్యశాల ఏడీ వి. చిట్టినాయుడు బుధవారం తెలిపారు. మొక్కజొన్న ఐదు కిలోలు రూ.340 కాగా, సబ్సిడీ రూ.255 పోను రైతు వాటా రూ.85, కాకిజొన్న ఐదు కిలోలు రూ. 460 కాగా, సబ్సిడీ రూ.345 పోను రైతు వాటా రూ.115 చెల్లించాలన్నారు. రెండో దఫా 900 కిలోల కాకిజొన్న, 530 కిలోల మొక్కజొన్న, 6,100 కిలోల అలసంద గడ్డి విత్తనాలు వచ్చాయన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు



తొలి ఏకాదశి పూజలో భాగంగా సంకల్పం చేస్తున్న పులఖండం విజయబాబు

అనకాపల్లి : పట్టణ పరిధిలోని వేంకటేశ్వరస్వామి, రాముల వారి ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు బుధవారం ఘనంగా జరిగాయి. స్థానిక దేమునిగుమ్మంలో వేంకటేశ్వరస్వామి దేవాలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామికి తొలి ఏకాదశి పూజలను ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం విజయబాబు నిర్వహించారు. మొదటి రోజు ఆలయ మండపంలో సంకల్పం, దీక్షాధారణ, పంచగవ్య, ప్రాశన, మృత్సంగ్రహణం వంటి పూజలు చేపట్టారు. ఆలయ ఈవో రాజా సులోచన, అర్చకులు పులఖండం ప్రసాద్ బాబు, రాజేష్, భక్తులు పాల్గొన్నారు.

కల్కి అవతారంలో జగన్నాథస్వామి



కశింకోటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో కల్కి అవతారంలో జగన్నాథస్వామి



తిరుగు రథోత్సవంలో భాగంగా తాళ్లతో స్వామి వారిని లాగుతున్న భక్తులు

కశింకోట : స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న జగన్నాథ స్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే మూల విరాట్ వేణుగోపాలస్వామిని కూడా పూలమాలలతో అందంగా అలంకరించి పూజించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వామి వారికి పూజలు చేశారు. అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, మారుతి తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, టీడీపీ నాయకులు పెంటకోట రాము, కూటమి నాయకులు వేగి కోటేశ్వరరావు, భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

ఘనంగా తిరుగు రథోత్సవం

జగన్నాథస్వామి తిరుగు రథోత్సవం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్ద నుంచి అందంగా అలంకరించిన రథంపై జగన్నాథస్వామి, బలభద్ర, సుభద్ర సమేతంగా ఈ యాత్ర సాగింది. యాత్రలో భాగంగా తోడపెద్దు సేవ, తీన్‌మార్ డప్పులతో బాణసంచా కాలుస్తూ యువతీ యువకులు ఉత్సాహంగా రథాన్ని తాళ్లతో లాగుతూ ముందుకు సాగారు. అక్కడి నుంచి గ్రామ ప్రధాన వీధుల మీదుగా రథోత్సవం సాగి తిరిగి ఆలయానికి చేరుకుంది. ఈ సమయంలో దారి పొడవునా ప్రజలు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, మారుతి, రేజేటి శ్రీరామచరణాచార్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

భక్తులకు అన్నసమారాధన..

తుమ్మపాల : జగన్నాథపురంలో వేంచేసిన శ్రీ జగన్నాథస్వామి వారి రథయాత్ర సందర్భంగా బుధవారం అన్న సమారాధన కార్యక్రమాన్ని ఎంపీ సీఎం రమేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ప్రారంభించారు. సాయంత్రం గ్రామ పురవీధుల్లో వైభవంగా రథయాత్ర జరిగింది. ఈ కార్యక్రమంలో దేవర బాబురావు, సర్పంచ్ మువ్వల రాము, జనసేన, టీడీపీ నాయకులు సర్వసిద్ధి శ్రీనివాసరావు, బండారు రామారావు, ప్రజలు పాల్గొన్నారు.

జగన్నాథస్వామి హుండీ ఆదాయం రూ.13 లక్షలు



గవరపాలెం జగన్నాథస్వామి ఆలయంలో హుండీ లెక్కిస్తున్న దృశ్యం

అనకాపల్లి : సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి హుండీ ద్వారా రూ. 13 లక్షల ఒక వెయ్యి, 385 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో రాజసులోచన తెలిపారు. స్థానిక గవరపాలెం జగన్నాథస్వామి ఆలయంలో బుధవారం నవరాత్రి ఉత్సవ హుండీ లెక్కింపు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తుల కానుకల ద్వారా ఈ ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ, డైరెక్టర్లు బొండా రాజేష్, అనకాపల్లి మోహన్‌రావు, బొడ్డేడ వెంకట చలపతిరావు, కాండ్రేగుల వెంకట వీర అప్పారావు, బి.కోటేశ్వరరావు, యల్లమల్లి ధనలక్ష్మి, బుద్ద లక్ష్మీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 5 నుంచి కోటి కుంకుమార్చన పూజలు



కరపత్రికలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి : మండలంలో కనకదుర్గ అమ్మవారి ఆలయంలో వచ్చే నెల 5 నుంచి శ్రావణ మాసం సందర్భంగా కోటి కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అన్నదాన చైర్మన్ దుడ్డు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా కోటి కుంకుమార్చన కరపత్రికలను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి శుక్రవారం ఆగస్టు 9న, రెండో శుక్రవారం 16న, 19న శ్రావణపౌర్ణమి, 23న మూడో శుక్రవారం, 30న నాలుగో శుక్రవారం పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 31న కోటి కుంకుమార్చన ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని లలిత సహస్రనామ హోమము, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మేడిశెట్టి రామసత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు పలకా సత్యనారాయణ, అన్నదానం కన్వీనర్ కరణం సింహాద్రినాయుడు, ఆలయ కోశాధికారులు పోతల రమణ, రాయవరపు రామచంద్రరావు, ఆలయ నిర్మాణ చైర్మన్ లక్కరాజు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి చెక్కు అందజేత



అప్పారావు కుటుంబానికి రూ. లక్ష చెక్కు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి : పోలీస్ శాఖలో అంకితభావంతో విధులు నిర్వహించిన సిబ్బందికి గుర్తింపు లభిస్తుందని (పోలీస్ బ్యాచ్ 1990) శక్తి పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు టి.అనిల్ అన్నారు. తమ బ్యాచ్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ నక్కా అప్పారావు అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతి చెందారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు అసోసియేషన్ తరఫు నుంచి రూ. లక్ష చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటి ఉద్యోగి ఈ విధంగా మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ముబారక్, బోని శ్రీనివాసరావు, సుబ్బరాజు, వెంకటేశ్వర్లు, సాయి, నాయుడు, ఆనంద్, రామారావు, నరసింగరావు, కోటేశ్వరరావు, గంగాధర్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.